క్లుప్తంగా

మాజీ ఎంపీ బెల్లానను కలిసిన కిరణ్‌కుమార్


చంద్రశేఖర్‌తో మాట్లాడుతున్న కిరణ్‌కుమార్

రణస్థలం: విజయనగరం మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్‌ను ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ చీపురుపల్లిలో శుక్రవారం కలిశారు. బెల్లాన తల్లికి అనారోగ్యంగా ఉండటంతో పరామర్శించి ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. ఈయన వెంట వైఎస్సార్‌సీపీ నాయకులు రెడ్డి విశ్వేశ్వరరావు, గొర్లె అప్పలనాయుడు, మీసాల శ్రీనివాసరావు, గంట్యాడ సత్యం ఉన్నారు.

సర్టిఫికెట్ కోర్సు ప్రారంభం


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ సూర్యచంద్రరావు

శ్రీకాకుళం కల్చరల్: శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా కళాశాలలో రసాయన శాస్త్రం విభాగం ఆధ్వర్యంలో ఫుడ్ అడల్ట్రేషన్, ఇన్‌స్ట్రుమెంటల్ టెక్నిక్స్ అనే అంశంపై సర్టిఫికెట్ కోర్సును శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సూర్యచంద్రరావు, రసాయన విభాగాధిపతి డాక్టర్ సూర్యసునీత, కీర్తి, చాందిని, గీతిక, రోహిణి, అకడమిక్ కో–ఆర్డినేటర్ సీహెచ్ కృష్ణారావు, ఐక్యూ ఏసీ కో–ఆర్డినేటర్ ఎస్.పద్మావతి, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

క్రీడా పోటీలు ప్రారంభం


పోటీలు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఈశ్వరరావు

ఎచ్చెర్ల క్యాంపస్: మండల స్థాయి క్రీడా పోటీలను కుప్పిలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు శుక్రవారం ప్రారంభించారు. క్రీడా స్ఫూర్తితో విద్యార్థులు ముందుకు సాగాలని, పాఠశాలల్లో విద్యతో పాటు, క్రీడలకు సమాన ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. విద్యార్థులు నిర్వహించిన మార్చ్‌ఫాస్ట్ ఆకట్టుకుంది. నాయకులు చౌదిరి నారాయణమూర్తి, అలుపాన నాగిరెడ్డి, బల్లాడ అరుణకుమారి పాల్గొన్నారు.

విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు


తమ చిత్రాలు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

ఎచ్చెర్ల క్యాంపస్: శ్రీకాకుళం రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ఆర్‌జీయూకేటీ) ఎస్.ఎం.పురం క్యాంపస్‌లో విద్యార్థులకు జాతీయ సేవా పథకంలో భాగంగా స్వచ్ఛతా హీ కార్యక్రమం సందర్భంగా శుక్రవారం చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ పీవో డాక్టర్ వి.సింహాచలం పర్యవేక్షించారు. విద్యార్థులు పచ్చదనం–పరిశుభ్రత ఆధారంగా వేసిన చిత్రాలు ఆకట్టుకున్నాయి.

అల్లినగరంలో స్వచ్ఛతా సేవా కార్యక్రమం


చెత్తను తొలగిస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల: అల్లినగరం గ్రామంలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పంచాయతీ కార్యాలయ పరిసరాలను శుభ్రం చేశారు. చెత్తా చెదారాలను తొలగించి డంపింగ్‌యార్డ్‌కు తరలించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, గ్రామ పెద్దలు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

మెట్టవలసలో పారిశుద్ధ్య పనులు


జి.సిగడాం: బావిలో క్లోరినేషన్ చేస్తున్న సిబ్బంది

జి.సిగడాం: మెట్టవలస గ్రామంలో శుక్రవారం పారిశుద్ధ్య పనులు చేపటాటరు. బోర్లు, బావుల్లో క్లోరినేషన్ చేశారు. రోడ్లపై చెత్తను తొలగించారు. స్థానిక సర్పంచ్ కామోజుల అరుద్ర, ఎంపీటీసీ సభ్యురాలు బెవర విజయలక్ష్మి, నాయకులు బెవర జగన్నాథం, కామోజుల సీతారాం, పంచాయితీ కార్యదర్శి ధర్మవరపు సతీష్ పనులను పర్యవేక్షించారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం?

శ్రీకాకుళం క్రైమ్: నగరంలో జిల్లా పరిషత్ వెనుక నివాసముంటున్న ఓ వివాహిత ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఈ మేరకు రిమ్స్ ఔట్‌పోస్టులో ఎంఎల్‌సీ నమోదైంది. ఇదే విషయమై ఒకటో పట్టణ పోలీసుల వద్ద ప్రస్తావించగా సమాచారముందని, కేసు నమోదు చేయలేదని చెప్పారు.

వంద రోజుల వంచన

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు పూర్తయిన నేపథ్యంలో పాలనపై మెజారిటీ ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. సూపర్ సిక్స్ పేరిట హడావిడి చేసి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు తర్వాత వాటి సంగతే మర్చిపోవడంతో అన్ని వర్గాల్లోనూ అసహనం నెలకొంది. తమను గెలిపిస్తే నియోజకవర్గంలోని సమస్యలన్నింటినీ పరిష్కరిస్తామని కూటమి ఎమ్మెల్యే అభ్యర్థులు చెప్పినా.. కార్యాచరణలో మాత్రం విఫలం కావడంతో ఎక్కడి సమస్యలు అక్కడే తిష్ట వేశాయి. అమలుకాని హామీలను ఇచ్చిన ప్రజాప్రతినిధులను నిలదీసేందుకు ప్రజలు సన్నద్ధమవుతున్నారు.



ఎక్కడి సమస్యలు అక్కడే

- అమలుకాని ఎమ్మెల్యే గొండు శంకర్ హామీలు
- సమీక్షలకే పరిమితమవుతున్న వైనం


గొండు శంకర్
శ్రీకాకుళం ఎమ్మెల్యే

శ్రీకాకుళం/గార: శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ ఎన్నికల ముందు ఇచ్చిన హామీల అమలు కార్యరూపం దాల్చడం లేదు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంపై విమర్శలు చేస్తూ.. టీడీపీ అధికారంలోకి రాగానే పనులు శరవేగంగా పూర్తి చేస్తామని హామీ ఇచ్చినా వాటిలో ఒక్కటి కూడా ముందుకు సాగటం లేదు. ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు పూర్తయినా సూపర్ సిక్స్ పథకాల అమలుకే దిక్కులేకుండా పోయింది. ఇక నియోజకవర్గంలో హామీల పరిస్థితి మరింత దయనీయంగా ఉంది. ఎమ్మెల్యే, మంత్రులు కలసి శాఖలవారీగా సమీక్షలు నిర్వహించి హామీలు ఇస్తున్నారే తప్ప వాటి అమలు కోసం చిత్తశుద్ధి లేకుండాపోయింది. ఎన్నికల సందర్భంగా ఆమదాలవలస, శ్రీకాకుళం ఎమ్మెల్యేలు కూన రవికుమార్, గొండు శంకర్‌లు శ్రీకాకుళం–ఆమదాలవలస రోడ్డు విస్తరణ పనులపై అనేక విమర్శలు చేశారు. అధికారంలోకి వచ్చిన నెల రోజుల్లోనే పనులు పూర్తి చేస్తామని నమ్మించారు. వీరికి తోడు ముఖ్యమంత్రి చంద్రబాబు, మరో మంత్రి లోకేష్‌లు జిల్లాకు వచ్చినప్పుడు గొప్పగా ప్రకటించారు. వంద రోజులు పూర్తవుతున్నా రోడ్డు నిర్మాణం పనులు నత్తనడకనే సాగుతున్నాయి. ఎక్కడి వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా పనులు ఉన్నాయి. అత్యంత రద్దీగా ఉన్న ఈ రోడ్డుపై వాహనాల రాకపోకలకు జనం అనేక ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు పనులు పక్కన పెట్టి ప్రత్యామ్నాయ రోడ్డు నిర్మిస్తామని కూన రవికుమార్ చెప్పడం గమనార్హం.

- ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్ నిర్మాణం పనులు శరవేగంగా జరిపిస్తామని ఎన్నికల సందర్భంగా మంత్రి, ఎమ్మెల్యే చెప్పినప్పటికీ పనులు జరగటం లేదు. స్టేడియం పనులను 2014 నుంచి 2019 మధ్య టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పనులను ప్రారంభించారు. ఆర్ట్స్ కాలేజీ మైదానంలో రాష్ట్ర స్థాయిలో స్వాతంత్ర్యవేడుకలంటూ క్రీడాకారులు ఉపయోగించలేని విధంగా అప్పటి టీడీపీ ప్రభుత్వమే మైదానాన్ని నాశనం చేసింది. ఈ రెండు పనులను కూడా ఇప్పటికీ మోక్షం కలగడం లేదు.
- మున్సిపల్ కార్యాలయ భవనం పడగొట్టి కొత్త భవనం నిర్మించేందుకు నిధులు మంజూరు చేస్తామని చెప్పినా అది కూడా ప్రకటనకే పరిమితం అయింది. గత ప్రభుత్వ హయాంలో పేదలకు ఎంతగానో ఉపయోగపడే సర్క్యూలేషన్ పేట్రన్ ఫైల్ ఎక్కడుందని, దానికి ఎందుకు అమలు చేయటం లేదని ఎన్నికల సందర్భంగా ఘాటు విమర్శలు చేసిన ఎమ్మెల్యే గొండు శంకర్ ఆ తరువాత ఈ విషయాన్ని పట్టించుకోలేదు.
- గారలో వంశధార ఒడ్డున అసంపూర్తిగా ఉన్న ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేస్తామని హామీ ఇచ్చినా ఇప్పటివరకు దీనిపై ఎటువంటి చర్యలు చేపట్టలేదు. వమరవల్లి, తోనంగి, కళింగపట్నం జరిగిన ప్రచారాల్లో ఎత్తిపోతల పథకంపై ప్రస్తావించిన ఎమ్మెల్యే శంకర్ వాటిపై దృష్టిపెట్టలేదు. వంశధార కాలువ శివారు ప్రాంతమైన వత్సవలసకు కొద్ది రోజులే సాగునీరు వచ్చి, ఆ తర్వాత రాకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రతి పంచాయతీలో రోడ్లు, డ్రైనేజీలు నిర్మిస్తామని హామీలు గుప్పించినా ఇంతవరకు వాటిపై దృష్టి సారించలేదు.


ఇటీవల వర్షం పడినప్పుడు చెరువును తలపించిన తోటపాలెం రోడ్డు



నీటి ప్రవాహం లేని నారాయణపురం కుడికాలువ

హామీలే మిగిలె..

- అమలు కాని ఎమ్మెల్యే ఎన్ఈఆర్ వాగ్దానాలు
- ప్రజలకు తప్పని ఎదురుచూపులు


నడుకుదిటి ఈశ్వరరావు
ఎచ్చెర్ల ఎమ్మెల్యే

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల నియోజకవర్గం ఎమ్మెల్యేగా గెలుపొందిన నడుకుదిటి ఈశ్వరరావు హామీలు మాత్రం గాలికి వదిలేశారు. సాగునీరు, తాగునీరు, ఉపాధి, రోడ్ల నిర్మాణం, మత్స్యకారుల వలసలు నిర్మూలన వంటివి ప్రధాన సమస్యలుగా మిగిలిపోయాయి.

- ఎచ్చెర్ల మండలంలో 7175 ఎకరాలకు సాగునీరు అందించే నారాయణపురం కుడికాలువలో ప్రస్తుతం చుక్కనీరు లేదు. కాలువ ఎండిపోతోంది. పంటలు ఎండి పోయి రైతులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితులు నెలకొంది. రణస్థలం, లావేరు మండలాలకు సాగునీరు అందించే తోటపల్లి కాలువ, జి.సిగడాంకు నీరు అందే మడ్డువలస కాలువల శివారు ప్రాంత రైతులు సైతం సాగునీరు సజావుగా అందక పాట్లు పడుతున్నారు. కనీసం సాగునీటిపై దృష్టిపెట్టటం లేదు.
- జలజీవన్ మిషన్‌లో ప్రతి ఇంటికీ సురక్షిత తాగునీరు కుళాయిలు ద్వారా అందజేస్తామని హామీ ఇచ్చారు. నియోజక వర్గంలో 100 సచివాలయాలు పరిధిలో విడతలు వారీగా తాగునీరు అందించే చర్యలు తీసుకోవడం లేదు. గతంలో ప్రారంభమైన పనులు సైతం అసంపూర్తిగా ఉన్నాయి.
- అధికారంలోకి వచ్చిన వెంటనే రోడ్లుతనిర్మిస్తామని హామీ ఇచ్చారు. ఇటీవల వర్షాలకు ధర్మవరం, బొంతలకోడూరు, బుడుమూరు వంటి ప్రాంతాల్లో రహదారులు కొట్టుకుపోయాయి. దీంతో వాహనాల రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.
- స్థానిక మత్స్యకారులు గుజరాత్, తమిళనాడు, మహారాష్ట్ర వంటి ప్రాంతాలకు వలస పోతున్నారు. స్థానికంగా జెట్టీలు నిర్మించి, ఉపాధి కల్పిస్తామని, వలసలు నిర్మిస్తామని అప్పట్లో ప్రకటించారు. అయితే ఆ దిశగా ప్రయత్నాలు ప్రారంభించ లేదు. మత్స్య కార భృతి ఇస్తామన్న రూ. 20 వేలు సైతం వేట నిషేధ కాలానికి ఇవ్వ లేదు. మత్స్యకారులు బతుకు తెరువుకు వలస బాట పడుతున్నారు.
- స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. పైడిభీమవరంలో పారిశ్రామిక సెజ్ ఉన్నా స్థానికులకు ఉపాధి లభించడం లేదు. ఎమ్మెల్యే సొంత పాఠశాలలో అప్పుడప్పుడు ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లు నిర్వహించి ఉద్యోగ, ఉపాధిలు కల్పిస్తున్నట్లు ప్రచారం నిర్వహించుకుంటున్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత


నాన్‌స్టాప్ కౌంటర్ వద్ద బూజు దులుపుతున్న దృశ్యం

శ్రీకాకుళం అర్బన్: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం మనందరి బాధ్యతని ఆర్టీసీ శ్రీకాకుళం ఒకటి, రెండు డిపోల మేనేజర్లు మల్లికార్జునరాజు, కె.ఆర్.ఎస్.శర్మ అన్నారు. స్వచ్ఛతా సేవ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్ కార్యాలయం, పరిసర ప్రాంతాలు, గ్యారేజీలు పరిశుభ్రం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతిరోజూ జిల్లా కేంద్రం నుంచి మారుమూల గ్రామాలకు, సుదూర ప్రాంతాలకు ప్రయాణించేందుకు వేలాది మంది వస్తుంటారని, వారంతా చెత్తను ఎక్కడ పడితే అక్కడ విసిరేయకుండా చెత్తబుట్టలోనే వేయాలన్నారు. పరిసరాలు శుభ్రంగా ఉంటేనే మనమంతా ఆరోగ్యంగా ఉంటామన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్లు వి.రమేష్, ఎ.గంగరాజు, ఆర్టీసీ ఎస్ఎం ఎంపీ రావు, టీఐ–3 ఎల్ఎస్ నాయుడు, ఓపీఆర్ఎస్ సూపర్‌వైజర్ ఎండీఏ బాషా, ప్రసాద్, ఆర్టీసీ ఉద్యోగులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న విశ్వకర్మ పూజలు


కోలాట బృందాన్ని సత్కరిస్తున్న కమిటీ సభ్యులు


దీపారాధన చేస్తున్న మహిళలు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని చంపాగల్లివీధిలో విరాట్ విశ్వకర్మ భగవాన్ పంచరాత్రి పూజా మహోత్సవంలో భాగంగా శుక్రవారం నిర్వహించిన కోలాట ప్రదర్శన ఆద్యంతం అలరించింది. ఈ సందర్భంగా శ్రీకామాక్షి స్వర్ణకార సంఘం ఆధ్వర్యంలో విశ్వకర్మ పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకుముందు రోజు రాత్రి భక్తిశ్రద్ధలతో దీపారాధన జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు, మహిళలు పాల్గొన్నారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు పట్నాన రామశంకరరావు, సభ్యులు పాల్గొన్నారు.

మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీగా రాజశేఖర్


ఎస్పీ మహేశ్వరరెడ్డికి పూలకుండీ బహూకరిస్తున్న డీఎస్పీ రాజశేఖర్

శ్రీకాకుళం క్రైమ్: శ్రీకాకుళం మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీగా బి.రాజశేఖర్ శుక్రవారం తన ఛాంబరులో బాధ్యతలు స్వీకరించారు. ఈయన సీఐడీ నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఉద్యోగ విధుల్లో పనితీరుకు మెచ్చి ఇండియన్ పోలీస్ మెడల్ కూడా దక్కించుకున్నారు. విధుల్లో చేరిన అనంతరం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఇంతకు ముందు ఇక్కడ డీఎస్పీగా పనిచేసిన ఆర్.శ్రీనివాసరావు ఒంగోలుకు బదిలీపై వెళ్లారు.

సీతారాం ఏచూరికి నివాళి


సీతారాం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

రణస్థలం: ప్రజా పోరాట యోధుడు సీతారాం ఏచూరికి శుక్రవారం రణస్థలంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో సీపీఎం, సీఐటీయూ నాయకులు ఘనంగా నివాళులర్పించారు. ఆయన పోరాట జీవితాన్ని స్మరించుకున్నారు. సీపీఎం నాయకుడు సీహెచ్ అమ్మన్నాయుడు మాట్లాడుతూ.. ఏచూరి లేని లోటు తీరనిదన్నారు. ఏచూరి జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకొని ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని సూచించారు. సీపీఎం, సీఐటీయూ నాయకు లు పాల్గొన్నారు.

ఇస్కాన్‌లో హరినామ వారోత్సవాలు


హరినామ కీర్తనలు ఆలపిస్తున్న భక్తులు

శ్రీకాకుళం కల్చరల్: పొన్నాడ బ్రిడ్జి వద్ద ఇస్కాన్ జగన్నాథ మందిరంలో హరినామ వారోత్సవాలలో భాగంగా శుక్రవారం హరినామ భజన నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు లక్ష్మీపతి గౌర్ మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా ఈ నెల 17 నుంచి 23 వరకు హరినామ వారోత్సవాలు జరుగుతున్నాయని చెప్పారు. భగవంతుని నామాన్ని సంకీర్తన చేయడం, నామాన్ని రాసి హుండీలో వేయడం, నగర సంకీర్తన, , హరినామ ప్రవచనం జరుగుతున్నాయని వివరించారు. భక్తులంతా పాల్గొనాలని కోరారు.

రేపటిలోగా ఈ–పంట నమోదు చేయించుకోవాలి

ఎచ్చెర్ల క్యాంపస్: రైతులు ప్రభుత్వ పథకాలు ప్రయోజనం పొందటం కోసం ఈ నెల 23వ తేదీలోపు ఈక్రాప్ నమోదు చేసుకోవాలని ఎచ్చెర్ల వ్యవసాయ అధికారి వై.సురేష్ సూచించారు. ఈ మేరకు శుక్రవారం ప్రకటన విడుదల చేశారు. రైతు సేవా కేంద్రాల్లో వ్యవసాయ, ఉద్యానవన సహాయకులను సంప్రదించాలన్నారు.

సక్రమంగా మెనూ అమలు

ఎచ్చెర్ల క్యాంపస్: పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం, అంగన్‌వాడీ కేంద్రాల్లో అమలు చేస్తున్న పౌష్టికాహారంలో మెనూ తప్పనిసరిగా అమలు చేయాలని జిల్లా బాలల హక్కుల పరిరక్షణ కమీషనర్ కొత్తకోట శ్రీనివాసరావు అన్నారు. కుప్పిలి మోడల్ స్కూల్లో మధ్యాహ్న భోజనాన్ని శుక్రవారం పరిశీలించారు. చినరావుపల్లి, అజ్జరాం గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించారు. ప్రభుత్వం సూచించిన మెనూ అమలు చేయాలని చెప్పారు. వంటశాలల్లో పరిశుభ్రత పాటించాలని సూచించారు.

ఎస్పీని కలిసిన ఎస్ఐలు

శ్రీకాకుళం క్రైమ్: ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో శ్రీకాకుళం రెండో పట్టణ పోలీస్ స్టేషన్ ఎస్ఐగా ఆర్.సంతోష్‌కుమార్, మెళియాపుట్టి ఎస్ఐగా పి.రమేష్‌బాబు పోస్టింగ్ దక్కించుకున్న విషయం తెలిసిందే. గురువారం వీరు విధుల్లో చేరిన అనంతరం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. శాంతిభద్రతలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎస్పీ సూచించారు.

నేడు గురజాడ జయంతి సభ

శ్రీకాకుళం కల్చరల్: సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో ఈ నెల 21న విశాఖ ఏ కాలనీలో సన్ డిగ్రీ కళాశాలలో గురజాడ 162వ జయంతి సభ నిర్వహిస్తున్నట్లు ప్రతినిధి కేతవరపు శ్రీనివాసు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధాన వక్తగా ప్రముఖ కథా రచయిత అట్టాడ అప్పలనాయుడు, ముఖ్య అతిథిగా ప్రిన్సిపాల్ పొన్నాన జయరాం, విశిష్ట అతిథిగా అంబేడ్కర్ యూనివర్సిటీ తెలుగు ఆచార్యులు డాక్టర్ కె.ఉదయ్‌కిరణ్ పాల్గొంటారని పేర్కొన్నారు. విద్యార్థులు, అభిమానులు హాజరుకావాలని కోరారు.

బొంతలకోడూరులో మానవహారం


మానవహారంగా ఏర్పడిన విద్యార్థులు

ఎచ్చెర్ల క్యాంపస్: స్వచ్ఛతా హీ కార్యక్రమంలో భాగంగా బొంతలకోడూరు గ్రామంలో శుక్రవారం మానవహారం నిర్వహించారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు పారిశుద్ధ్యం, పచ్చదనంపై ప్రజలకు, విద్యార్థులకు అవగాహన కల్పించారు.

మద్యం మత్తులో విద్యార్థులపై దాడి

శ్రీకాకుళం క్రైమ్: మద్యం మత్తులో టిఫిన్ చేయడానికి వచ్చిన ఓ వ్యక్తి అక్కడే టిఫిన్ చేస్తున్న ఇద్దరు విద్యార్థులపై దాడికి పాల్పడ్డాడు. ఆ వ్యక్తి నుంచి తమను తాము రక్షించుకునే క్రమంలో విద్యార్థులు కూడా ఆ వ్యక్తిపై తిరగబడ్డారు. ఒకటో పట్టణ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గురువారం రాత్రి పది గంటల సమయంలో మండలవీధి సమీప కోరాడ వీధిలో వెంకటరావు టిఫిన్ షాపు నిర్వహిస్తుండగా అక్కడ కొంతమంది విద్యార్థులు టిఫిన్ చేస్తున్నారు. అదే సమయంలో ఫూటుగా మద్యం తాగి వచ్చిన కేశవరావు విద్యార్థులతో వాగ్వాదానికి దిగాడు. దురుసుగా ప్రవర్తించడంతో విద్యార్థులు వారించారు. కేశవరావు వినకపోగా విద్యార్థుల బట్టలు చింపేసి దాడికి పాల్పడ్డాడు. దీంతో విద్యార్థులు కూడా ప్రతిఘటించి కేశవరావును ఎదుర్కొన్నారు. ఈ క్రమంలో కేశవరావుకు గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనాస్థలికి వెళ్లగా కేశవరావు రాజీ అవుదామని చెప్పడంతో అక్కడినుంచి వెనుదిరిగారు.

జరిగిన విషయాన్ని దాచిపెట్టి..

మద్యం మత్తులో ఉన్న కేశవరావు అదే సమయంలో రిమ్స్‌కు వెళ్లి తనపై గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేసినట్లు, వైద్య చికిత్స నిమిత్తం వచ్చినట్లు చెప్పడంతో అక్కడ ఔట్‌పోస్టులో ఎంఎల్‌సీ రిపోర్టు నమోదైంది. శుక్రవారం సాయంత్రం ఎంఎల్‌సీ రిపోర్టు రావడంతో ఒకటో పట్టణ ఎస్ఐ హరికృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వాండ్రంగిలో వైద్య సేవలు


రోగులకు రక్తపరీక్షలు చేస్తున్న సిబ్బంది

జి.సిగడాం: వాండ్రంగి గ్రామంలో రోగులకు శుక్రవారం వైద్యసేవలు అందించారు. స్థానిక ఏఎన్ఎం అన్నపూర్ణ, ఎంఎల్‌హెచ్ పి.సంధ్యారాణి ఆధ్వర్యంలో రోగులకు రక్తపరీక్షలు చేసి మందులను అందించారు. సర్పంచ్ సాకేటి నాగరాజు, మండల పంచాయతీ అధికారి ఎస్.శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి వడగా గౌరీశంకరరావు, ఆశ కార్యకర్త ఉన్నారు.

నేడు పెంటలో దంతవైద్య శిబిరం

పెంట గ్రామంలోని యూపీ పాఠశాలలో శనివారం ఉదయం తొమ్మిది గంటలకు రాజాం వికాస తరంగణి ఆధ్వర్యంలో ఉచిత దంత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్టు ప్రధానోపాధ్యాయులు మజ్జి మదన్ మోహన్ శుక్రవారం తెలిపారు. వికాస తరంగిణి రాష్ట్ర కార్యనిర్వహక అధ్యక్షులు టి.టి.వి.రమణమూర్తి పర్యవేక్షణలో చేపట్టనున్న దంత వైద్య శిబిరాన్ని గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

• విద్యార్థులకు అభినందనలు


బాతువ పాఠశాల విద్యార్థులను అభినందిస్తున్న సిబ్బంది

జి.సిగడాం: ఈనెల 18న స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో జరిగిన మండలస్థాయి క్రీడా పోటీల్లో బాతువ, సిగడాం జెడ్పీ పాఠశాలల విద్యార్థులు వివిధ పోటీల్లో పాల్గొన్ని సత్తా చాటారు. దీంతో విద్యార్థులను ప్రధానోపాధ్యాయులు పి.దుర్గాభవాని, పీవీఎస్ నర్సింహంమూర్తి, మండల బీజేపీ అధ్యక్షులు వజ్జిపత్తి రఘురాంతోపాటు ఉపాధ్యాయులు శుక్రవారం అభినందించారు. కార్యక్రమంలో పీడీలు శ్యామల, త్రినాథ్, ఉపాధ్యాయలు సాయిరాం కుమార్, చిన్నారావు, ఈశ్వరసత్యన్నారాయణ, దేవి, మురళీ, గౌరీశ్వరరావు, మాధవి, మాణిక్యాలరావు, రమణ ఉన్నారు.